చిత్తారమ్మ జాతరను విజయవంతం చేయాలి



జాతర కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్

ఎమ్మెల్యే వివేకానంద్

సుభాష్‌నగర్: కోరిన కోర్కెలను తీర్చే కొంగు బంగారంగా గాజులరామారం శ్రీచిత్తారమ్మ దేవి విరాజిల్లుతోందని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. ఈ నెల 17 నుంచి 25వ తేదీ వరకు నిర్వహించనున్న అమ్మవారి జాతర స్వర్ణోత్సవ వేడుకల ఏర్పాట్లపై ఎమ్మెల్యే అధ్యక్షతన ఆలయ కమిటీ సభ్యులు, వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..జాతరకు హైదరాబాద్ నగరంలోని నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేస్తారన్నారు. చిత్తారమ్మ జాతర స్వర్ణోత్సవ వేడుకలలో ముఖ్యంగా జాతర నిర్వహించే ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో హాజరవుతారని, వారికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆర్టీసీ బస్సులు, తాగునీటి సౌకర్యం, లైటింగ్ ఏర్పాటు, టెంపరరీ టాయిలెట్లు వంటి సదుపాయాలను కల్పించాలని అధికారులకు ఆదేశించారు. అంతకుముందు ఆలయ కమిటీ చైర్మన్ కూన అంతయ్య గౌడ్, కార్యదర్శి బాలరాజు, సభ్యులు, పురోహితులు ఎమ్మెల్యేకు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. ఆయన అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఉప కమిషనర్ మల్లారెడ్డి, జీడిమెట్ల ఆర్టీసీ డిపో మేనేజర్ ఆంజనేయులు, సూరారం కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ, ట్రాఫిక్ సీఐ శ్రీనివాస్, జీహెచ్ఎంసీ ఈఈ కిష్టప్ప, ఎస్ఐ ప్రేమ్ సాగర్, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి



దుండిగల్: మహిళలు ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని మున్సిపల్ చైర్ పర్సన్ శంభీపూర్ కృష్ణవేణి అన్నారు. దుండిగల్ మున్సిపాలిటీ 26వ వార్డు శంభీపూర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన మహిళా భవనాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళా ఉపాధ్యాయ దినోత్సవం రోజున ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ శంభీపూర్ క్రిష్ణ, సీఈఓ మంజుల, ఆర్‌పీలు లక్ష్మి, రాణి, స్వరూప, ఆదిలక్ష్మి, ఉమారాణి, మల్లీశ్వరి, గ్రామస్తులు పుష్పమ్మ, వరలక్ష్మి, స్రవంతి, లత, లావణ్య, దమయంతి, అనిత, జ్యోతి పాల్గొన్నారు.

అద్దె భవనం కష్టాలకు చెక్

అద్దె భవనంలో కొనసాగుతున్న కుత్బుల్లాపూర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి సొంత భవనం నిర్మించేందుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు శాశ్వత భవనాలు పునర్ వ్యవస్థీకరణ విషయమై మూడు రోజుల క్రితం రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించారు. వివిధ పనుల నిమిత్తం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వచ్చే ప్రజలకు మెరుగైన సేవలతో పాటు వారికి అవసరమైన వసతులు, స్టాంపులు రిజిస్ట్రేషన్ల శాఖ కార్యకలాపాలు కొనసాగే విధంగా కార్యాలయాలకు కార్పొరేట్ హంగులు తీసుకురావడానికి ప్రభుత్వం నిర్ణయించింది. తొలి దశలో నగర శివారు ప్రాంతాల్లో నాలుగు రిజిస్ట్రేషన్ కార్యాలయాల నిర్మాణాలను చేపట్టేందుకు నిర్ణయించారు. అందులో కుత్బుల్లాపూర్ కార్యాలయం ఒకటి. – సుభాష్‌నగర్

- సొంత భవనం నిర్మాణానికి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్
- మొదటి నాలుగు కార్యాలయాల్లో కుత్బుల్లాపూర్ ఒకటి
- ఇరుక్కు గదుల్లో కుత్బుల్లాపూర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం



సూరారంలోని కుత్బుల్లాపూర్ రిజిస్ట్రార్ కార్యాలయం

అధునాతన హంగులతో..

మొదటి దశలో నిర్మించనున్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు కనీసం మూడు ఎకరాలు కేటాయించనుంది. అందులో 10 నుంచి 15 వేల చదరపు అడుగుల్లో అధునాతన హంగులతో కార్యాలయ భవన నిర్మాణాలు చేపట్టేందుకు ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించింది. వెయిటింగ్ హాల్, తాగునీటి సదుపాయం, పార్కింగ్, ఇతర వసతులు, డిజైన్లు ఉండేలా భవనాలను నిర్మించనున్నారు.

సూరారంలో 2007లో ఏర్పాటు

గతంలో కుత్బుల్లాపూర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం మేడ్చల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఉండేది. ఇక్కడ స్థానికంగా క్రయవిక్రయాలు జరిగితే మేడ్చల్‌కు వెళ్లి రిజిస్ట్రేషన్లు చేయించుకోవాల్సి వచ్చేది. ఈ ప్రాంతం అభివృద్ధి చెందడంతో పాటు జనాభా పెరగడంతో ప్రభుత్వం 2007లో సూరారంలో కుత్బుల్లాపూర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని ఏర్పాటు చేసింది. ప్రతిరోజు 100కు పైగా రిజిస్ట్రేషన్లు జరిగే ఈ కార్యాలయం నుంచి కోట్ల రూపాయల ఆదాయం వస్తున్నా కనీసం సొంత భవనం లేకపోవడంతో సంవత్సరాలుగా అద్దె భవనంలో విధులు నిర్వహిస్తున్నారు.

పార్కింగ్ సదుపాయం లేక..

నిత్యం 100కు పైగా రిజిస్ట్రేషన్ జరిగే ఈ కార్యాలయానికి క్రయవిక్రయదారులతో పాటు వివిధ పనుల నిమిత్తం వచ్చేవారి తాకిడి పెద్ద సంఖ్యలో ఉంటుంది. కుత్బుల్లాపూర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం సూరారం ప్రధాన చౌరస్తాను ఆనుకుని ఉండడంతో పార్కింగ్ సదుపాయం లేక కార్యాలయానికి వచ్చేవారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారు.



క్రయవిక్రయదారులతో రద్దీగా ఉన్న కార్యాలయం

ఇబ్బందులు తొలగినట్టే..



ప్రభుత్వం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి సొంత భవనం నిర్మించనుండటంతో ఇబ్బందులు తొలగనున్నాయి. పార్కింగ్ సదుపాయం లేక ఇరుకైన గదులతో కొంత ఇబ్బందులు పడ్డాం. కార్యాలయానికి వచ్చే వారి పనులను పెండింగ్‌లో ఉంచకుండా ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నాం. కొత్త భవన నిర్మాణం జరిగితే కార్యాలయంలో పని వేగవంతంతో పాటు కార్యాలయం వచ్చే వారికి సులభంగా ఉంటుంది.

– అశోక్, సబ్ రిజిస్ట్రార్, కుత్బుల్లాపూర్

సాక్షి ఆధ్వర్యంలో నేడు ముగ్గుల పోటీలు

సుభాష్‌నగర్: సంక్రాంతి పండుగను పురస్కరించుకొని శనివారం సాక్షి ఆధ్వర్యంలో శ్రీ ఎస్.పి.ఆర్ గ్లోబల్ స్కూల్ సౌజన్యంతో ముగ్గుల పోటీలు నిర్వహించనున్నట్లు ఎస్‌పీఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ (ఫౌండర్) సొంటిరెడ్డి పున్నారెడ్డి శుక్రవారం తెలిపారు. గాజులరామారం డివిజన్ చిత్తారమ్మ దేవినగర్‌లోని శ్రీ ఎస్.పి. ఆర్ గ్లోబల్ స్కూల్ ఆవరణలో శనివారం ఉ.9:30 గంటలకు ముగ్గుల పోటీ ప్రారంభం కానుందని తెలిపారు. పోటీలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు పాల్గొన్న వారికి ప్రోత్సాహక బహుమతులు ఇవ్వనున్నట్లు వెల్లడించారు. పోటీలో పాల్గొనేవారు ఎవరి మెటీరియల్ వారు తెచ్చుకోవాలన్నారు. వివరాలకు 7997995252 సంప్రదించాలని కోరారు.

రేపు స్టెమ్ ఎక్స్‌పో టెక్నికల్ ఫెస్ట్

రంగారెడ్డినగర్: రంగారెడ్డినగర్ డివిజన్ మారుతి నగర్‌లోని ప్రణవ్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో ఆదివారం స్టెమ్ ఎక్స్‌పో పేరిట టెక్నికల్ ఫెస్ట్‌ను నిర్వహించనున్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కొనసాగే స్టెమ్ ఎక్స్‌పోలో విద్యార్థులు రూపొందించిన పలు సైన్స్ నమూనాలను ప్రదర్శించనున్నారు. పాఠశాల ఆవరణలో విద్యార్థుల ఆధ్వర్యంలో ఫుడ్‌స్టాళ్లను ఏర్పాటు చేయనున్నట్లు పాఠశాల యాజమాన్యం పేర్కొంది.

నేడు మున్సిపల్ కార్పొరేషన్ సమావేశం

నిజాంపేట్ : నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పాలకవర్గ సర్వసభ్య సమావేశం శనివారం ఉదయం 11 గంటలకు మేయర్ కొలన్ నీలారెడ్డి అధ్యక్షతన నిర్వహించనున్నారు. ఈనెల 27తో పాలకవర్గం పదవీకాలం ముగియనుండటంతో ఈ సమావేశానికి ప్రాధాన్యత నెలకొంది. కార్పొరేషన్ పరిధిలో మిగిలిన అభివృద్ధి పనులకు సంబంధించి తీర్మానాలు చేసే అవకాశం ఉంది. రూ.325.67 కోట్ల వ్యయంతో 1755 అభివృద్ధి పనులు మంజూరయ్యాయి. అందులో రూ.233.01 కోట్ల వ్యయంతో 1505 అభివృద్ధి పనులు పూర్తయ్యాయి. రూ.215.37 కోట్ల వ్యయంతో 77 అభివృద్ధి పనులు ప్రోగ్రెస్‌లో ఉన్నాయి. ఇటీవల కాలంలో రూ.23.35కోట్ల వ్యంతో 55 అభివృద్ధి పనులు చేపట్టారు.



బాచుపల్లిలోని తెలుగు యూనివర్సిటీలో..



సత్‌జ్ఞాన్ హైస్కూల్‌లో కేక్ కట్ చేస్తున్న ఉపాధ్యాయులు



నెహ్రూనగర్ ప్రభుత్వ పాఠశాలలో ఎంఈఓని సత్కరిస్తున్న ఉపాధ్యాయులు



జగద్గిరిగుట్టలో గూడ ఐలయ్యగౌడ్ ఆధ్వర్యంలో..

ఘనంగా సావిత్రిబాయి పూలే జయంతి

చిత్రపటానికి పూలమాలేసి ఘన నివాళి

మహిళా సంఘ సంస్కర్త, భారతదేశ మొదటి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలను శుక్రవారం నియోజకవర్గ వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మహిళలకు విద్యా బోధన చేయడంతో ఆనాడు సమాజంలో నెలకొన్న దురాచారాలపై సావిత్రిబాయి పోరాడారని వక్తలు కొనియాడారు. నేటి మహిళలు ఆమెను స్ఫూర్తిగా తీసుకుని సామాజిక సేవా కార్యక్రమాల్లో పాలు పంచుకోవాలన్నారు. –కుత్బుల్లాపూర్



సూరారం ప్రభుత్వ పాఠశాలలో..



ప్రగతినగర్‌లో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో..



మగ్దూమ్‌నగర్‌లో సీపీఐ ఆధ్వర్యంలో..



శ్రీనివాస్‌నగర్‌లో ..కొలన్ హన్మంతరెడ్డి తదితరులు



భౌరంపేట్ ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న హెచ్ఎం



నిజాంపేట్ ప్రభుత్వ పాఠశాలలో మహిళా ఉపాధ్యాయులకు సన్మానం



కొంపల్లిలో సతీష్‌సాగర్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకలో నివాళులర్పిస్తూ..

నిరుపేదలకు దుప్పట్ల పంపిణీ

కుత్బుల్లాపూర్: అర్ధరాత్రి రోడ్ల పక్కన నివాసముండే నిరుపేదలకు తెలంగాణ సంకల్పశక్తి సేవా సమితి ఆధ్వర్యంలో దుప్పట్ల పంపిణీ చేపట్టారు. గురువారం అర్ధరాత్రి కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాంతాల్లో తిరుగుతూ వారిని గుర్తించి శ్రీనివాస్ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ప్రతి ఒక్కరూ అనాథలకు అండగా ఉండాలని, మరిన్ని సంస్థలు ముందుకు వచ్చి సహాయం చేయాలని కోరారు.

బ్యాంక్ అభివృద్ధికి కృషి చేయాలి



సిబ్బందిని అభినందిస్తున్న రంజయ్ కుమార్ మిశ్రా

కుత్బుల్లాపూర్: వినియోగదారులకు మెరుగైన సేవలను అందించడంతో పాటు బ్యాంక్ అభివృద్ధి కి సిబ్బంది కృషి చేయాలని ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ హైదరాబాద్ చీఫ్ రీజనల్ మేనేజర్ రంజయ్ కుమార్ మిశ్రా అన్నారు. జీడిమెట్ల డివిజన్ అంగడిపేట్‌లో ఉన్న బ్రాంచ్‌లో ఇటీవల సేవింగ్స్, కరెంట్ ఖాతాలను తెరవడంతో పాటు బంగారంపై రుణాలను అందించిన సిబ్బంది సేవలను గుర్తించారు. సిబ్బందికి రంజయ్ కుమార్ ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ క్రిష్టోఫర్, డిప్యూటీ మేనేజర్ మణికంఠ, క్లర్క్ మహదేవం, క్యాషియర్ సాయూ, సిబ్బంది పాల్గొన్నారు.

తెలంగాణ కబడ్డీ జూనియర్ అండర్ 19 సెలక్షన్స్



క్రీడాకారులతో మాట్లాడుతున్న తెలంగాణ కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు వీరేష్

నిజాంపేట్ : బాచుపల్లిలోని కాసాని కృష్ణ, జనార్దన్ సింగ్ గేలట్ కబడ్డీ అకాడమీలో శుక్రవారం తెలంగాణ కబడ్డీ జూనియర్ అండర్ (19) సెలక్షన్స్ జరిగాయి. బాలికల, బాలుర జట్లను ఎంపిక చేశారు. బాలికల, బాలుర విభాగంలో 15 మంది చొప్పున ఎంపిక చేశారు. తెలంగాణ 33 జిల్లాల నుంచి అత్యంత ప్రతిభ కలిగిన క్రీడాకారులను ఎంపిక చేసి శిక్షణ ఇచ్చారు.

నేడు లక్ష పుష్పార్చన

జగద్గిరిగుట్ట: చింతల్, పద్మా నగర్ ఫేజ్ 1లో శ్రీదేవి, భూదేవి సహిత శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం లక్ష పుష్పార్చన నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆలయ కమిటీ శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేసింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

గుర్రపుడెక్క తొలగించాలని వినతి

నిజాంపేట్ : రాజీవ్‌గాంధీ నగర్ 15, 16వ డివిజన్‌లో గల పత్తికుంట చెరువు, మేడికుంట చెరువులలో గుర్రపుడెక్క తొలగించాలని శుక్రవారం కార్పొరేషన్ కమిషనర్‌కు యువజన కాంగ్రెస్ జిల్లా సెక్రటరీ ఎర్రోళ్ల విష్ణు వినతిపత్రం అందజేశారు. వెంటనే కమిషనర్ స్పందించి ఆదేశాలు ఇచ్చినట్లు ఆయన తెలిపారు.

నేడు జిల్లా స్థాయి టాలెంట్ టెస్టు

సాక్షి,సిటీబ్యూరో: కూకట్‌పల్లిలోని జెడ్పీహెచ్ఎస్‌లో శనివారం ఉదయం 10:30 గంటలకు జిల్లా స్థాయి సోషల్ టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు జిల్లా సాంఘిక శాస్త్రం ఉపాధ్యాయుల ఫోరం అధ్యక్షుడు మదన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీనయ్య ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. మండల స్థాయిలో సెలెక్టు కాబడిన 101 విద్యార్థులు ఈ టెస్ట్‌కు తప్పనిసరి హాజరు కావాలని కోరారు. వారు హాజరయ్యే బాధ్యతను సంబంధిత సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు తీసుకోవాలని వారు సూచించారు. టెస్ట్ తర్వాత జరిగే సమావేశానికి ముఖ్య అతిథిగా మేడ్చల్ –మల్కాజిగిరి జిల్లా విద్యాశాఖ అధికారి విజయకుమారి హాజరుకానున్నట్లు పేర్కొన్నారు.